క్లుప్తంగా

వైభవంగా కనకదుర్గ అమ్మవారి వేడుకలు



పూజలో పాల్గొన్న లావణ్య

కొత్తూరు: తిమ్మాపూర్ చౌరస్తా కాలనీలో నూతనంగా నిర్మించిన కనకదుర్గ అమ్మవారి ఆలయ వేడుకలు ఆలయ ధర్మకర్త కోస్గి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యతో పాటు పలువురు నాయకులు, ప్రజలు వేదపండితులు నిర్వహించిన పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవేందర్‌యాదవ్, మహేశ్‌గౌడ్, చంద్రయ్య, శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ప్రభాకర్‌రెడ్డి



మొయినాబాద్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా శ్రీరాంనగర్ సర్పంచ్ సస్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఇటీవల శంషాబాద్‌లో జరిగిన సమావేశంలో ప్రభాకర్‌రెడ్డిని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఇరవై ఏళ్లుగా పార్టీలో వివిధ హోదాల్లో కొనసాగుతూ సేవలందించారు. 2013, 2018లో శ్రీరాంనగర్ సర్పంచ్‌గా విజయం సాధించారు. రెండు పర్యాయాలుగా సర్పంచ్‌గా కొనసాగుతూనే పార్టీ బలోపేతానికి, విస్తరణకు ఆయన చేసిన సేవలను గుర్తించిన పార్టీ అధినాయకత్వం కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన పదవిని సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు.

అయ్యప్ప దేవాలయ నిర్మాణానికి విరాళాలు

శిలాఫలకంపై దాతల పేర్లు నమోదు

అయ్యప్ప సేవా సమితి సభ్యులు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో అయ్యప్ప దేవాలయ నిర్మాణానికి వస్తు, నగదు, బంగారం, వెండి రూపేణ విరాళాలు అందజేసే భక్తుల పేర్లను శిలాఫలకంపై ఏర్పాటు చేయిస్తామని ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ. 50వేలకు పై చిలుకు విరాళాలు ఇచ్చిన వారి పేర్లను శిలాఫలకంపై వ్రాయించి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. రూ. 50వేలకు పైచిలుకు అందజేసిన భక్తులు 7రోజుల్లో 9440017595 ఫోన్ నెంబర్‌పై నిర్ధారణ చేసుకోవాలని ఆలయకమిటీ సభ్యులు సూచించారు.

ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు అభినందనలు



పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఒగ్గు కిషోర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంలో షాద్‌నగర్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఒగ్గు కిషోర్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పూలబొకే ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు. రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేందుకు సజ్జనార్ చేసిన కృషిని ఒగ్గు కిషోర్ కొనియాడారు. ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న వీఓఏలు

కొందుర్గు: వీఓఏల వేతనాలు పెంచుతున్నట్లు ప్రకటించడంతో శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో వీఓఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వీఓఏలకు ప్రభుత్వం నుంచి రూ. 5 వేలు, గ్రామసంఘం నుంచి రూ.3 వేలు ఇస్తామని ప్రకటించడం భినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లేడ్ చౌదరిగూడ వీఓఏల మండల కమిటీ అధ్యక్షురాలు సునీత, వివిధ గ్రామాల వీఓఏలు పాల్గొన్నారు.

పల్లెబాటతో సమస్యల పరిష్కారం

అంజన్నది అభివృద్ధి మంత్రం

- 13 గ్రామపంచాయతీలకు నిధులు మంజూరు
- ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు భీష్వరామకృష్ణ



షాద్‌నగర్‌రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న భీష్వరామకృష్ణ



నిధుల మంజూరు పత్రాన్ని చూపిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: పల్లెబాటతో గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కే దక్కుతుందని ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు భీష్వరామకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భీష్వరామకృష్ణ మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ నిరంతరం పరితపిస్తుంటారన్నారు. ప్రజా సమస్యలను క్షేత్ర స్థాయిలో తెలుసుకోవాలనే తపనతో ఆయన పల్లెబాటలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు నిధులను మంజూరు చేయించారన్నారు. మండలంలో హెచ్‌ఎండీఏ పరిధిలోని 13 గ్రామపంచాయితీలకు దాదాపు రూ. 5కోట్లను మంజూరు చేయించారన్నారు. రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ఆశీస్సులతో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కృషితోనే గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. మున్సిపాలిటీనుంచి వచ్చే మురుగు నీరు లింగారెడ్డిగూడ సమీపంలో చేరి మురుగు సమస్య తీవ్రంగా ఉండేదన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే ఎస్‌డీఎఫ్ నిధులనుంచి రూ.75 లక్షలు మంజూరు చేయించారన్నారు. గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధికి నిధులకోసం మంత్రుల చుట్టూ, ఎమ్మెల్యే చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్న తరువాత మన నిధులు, మన నీళ్లు, మన ఉద్యోగాలు మనకే దక్కుతున్నాయన్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై ఎన్ని విమర్శలు చేసినా ఎమ్మెల్యే అభివృద్ధితోనే సమాధానం చెబుతున్నారన్నారు. ఎమ్మెల్యేకు నియోజకవర్గంపై, ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. రెండు సార్లు గెలిచిన అంజయ్యయాదవ్ నియోజకవర్గంలో ఎవరూ చేయలేని అభివృద్ధి చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేను గెలిపించి విజయ పరంపరను కొనసాగిస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ దొడ్డిమాధవిరంగయ్య, ఎంపీటీసీ శ్రీశైలం, రాధాకృష్ణ, అశోక్‌రెడ్డి, పాపాయ్య యాదవ్, మహేశ్, రాము, జయరాంరెడ్డి, యాదయ్య, బాల్‌రాజ్, శివరాజ్‌గౌడ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో గ్రామాలు అభివృద్ధి

కొత్తూరు: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో గ్రామాలు అభివృద్ధి చెందాయని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలపార్టీ అధ్యక్షుడు మెండెకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కృషితో హెచ్‌ఎండీఏ నిధులు రూ.5 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో సీసీరోడ్లు, భూగర్భ డ్రైనేజీతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే సహకారంతో కొత్తూరు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామన్నారు. గత ప్రభుత్వాలు కేవలం హామీలు, మాటలతోనే సరిపెట్టి గ్రామాలను పట్టించుకోలేదన్నారు. ఈ క్రమంలో వార్డుల్లోని కుళాయిల వద్ద నీటిని పట్టుకునే సమయంలో మహిళలు గొడవలకు దిగేవారన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకొచ్చిన తర్వాత మిషన్‌భగీరథ పథకం ద్వారా ప్రతీ ఇంటికి నల్లా నీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య నివారణకు ప్రతీ పంచాయతికి వాహనాలు కేటాయించి ఆరోగ్యకర వాతావరణాన్ని కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అజయ్‌నాయక్, తులశమ్మ, రవినాయక్, సాయిలు, సత్తయ్య, రాజు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: చేగూరు నుంచి మజీద్ మామిడిపల్లి వరకు రెండు వరుసల బీటీ రోడ్డు రహదారి ఏర్పాటునకు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ రూ.7 కోట్లు మంజూరు చేయించడంతో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు జంగిలి కుమార్ హర్షం వ్యక్తం చేశారు. నందిగామలో ఆయన మాట్లాడుతూ గత ఎమ్మెల్యేలు చేయలేని అభివృద్ధి పనులను అంజయ్య యాదవ్ చేస్తున్నాడన్నారు. నందిగామ నుంచి నర్సప్పగూడ రోడ్డు ధ్వంసమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కల్గుతుందని తెలుసుకున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ వెంటనే రూ.3 కోట్లు మంజూరు చేయించారు. ప్రస్తుతం పనులు జోరుగా కొనసాగుతున్నాయన్నారు.

దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఢిల్లీలో అమృత వాటిక నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటి నుంచి పిడికెడు మట్టి సేకరించి 'నా భూమి.. నా దేశం' కార్యక్రమం శుక్రవారం బీజేపీ నేతలు షాద్‌నగర్‌లో నిర్వహించారు. అనంతరం వారు ఏబీ విల్లాస్‌లో మిలటరీలో పని చేసిన వెంకట్‌రెడ్డి ఇంటి నుంచి మట్టి సేకరించి శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో జాతీయ భావాలను మరింతగా పెంపొందించి యువతను మేల్కొల్పాలని అన్నారు. యువత దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 15 వరకు కొనసాగుతుందని, అక్టోబర్ 29న ఢిల్లీలో సేకరించిన మట్టిని అమృతవాటిక నిర్మాణానికి ఉపయోగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, మురళీ, వంశీకృష్ణ, శ్రీనివాస్‌చారి, కిషోర్‌రెడ్డి, నర్సింహ్మా, హరిభూషణ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.



మట్టిని సేకరిస్తున్న బీజేపీ నేతలు

ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు



తుమ్మలపల్లి సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి

కొందుర్గు: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు ప్రతీ ఇంటికి చేరాయని మండలాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రేగడిచిల్కమర్రిలో ఏర్పాటుచేసిన సమావేశానికి అయన హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కృషితో షాద్‌నగర్ నియోజకవర్గంలోని ప్రతీ పల్లెకు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాసు రెడ్డి, రామచంద్రయ్య, నర్సింహ్మా రెడ్డి, యాదయ్య, శ్రీకాంత్, సిద్దు, బుచ్చయ్య, పాల్గొన్నారు.

జిల్లేడ్ చౌదరిగూడలో..

లచ్చంపేట, తుమ్మలపల్లి గ్రామాల్లో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సయ్యద్ హాఫీజ్ మాట్లాడుతూ అంజన్న కృషితోనే అన్ని గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో రాములు, జబ్బార్, వెంకటేశ్, రామచంద్రయ్య, గణేశ్, జహంగీర్, రామచంద్రయ్య, గోపాల్ పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో బంగారు భవిష్యత్

ఈఎస్‌సీఐ జనరల్ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వర్‌రావు



రామేశ్వర్‌రావును సన్మానిస్తున్న గురుజీ బ్రాజ్ బందుదాస

మొయినాబాద్‌రూరల్: సాంకేతిక విద్యతో బంగారు భవిష్యత్ ఉంటుందని ఈఎస్‌సీఐ జనరల్ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం జోగిన్‌పల్లి బీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ డే నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ జి రామేశ్వర్‌రావు, హరే కృష్ణ మువెంట్ యూనైటెడ్ హెడ్ ఆఫ్ యూత్ ఔట్‌రీచ్ వింగ్ గురుజీ బ్రాజ్ బందుదాసలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మొదటి సంవత్సరం విద్యార్థులు క్రమ శిక్షణతో నాణ్యమైన విద్యను నేర్చుకోవాలన్నారు. విద్య అనేది కంటిన్యూయస్ ప్రాసెస్ అని చెప్పారు. ఉన్నత విద్యలో కొత్త కొత్త విషయాలు తెలుసుకోవాలని తెలిపారు. నాలుగు సంవత్సరాల జర్నీలో మంచి ఆవిష్కరణల మీద దృష్టిపెట్టాలన్నారు. పరిశోధనల కోసం దేశంలో అన్ని వృత్తి, విద్య కళాశాలల కోసం స్టూడెంట్స్ చాప్టర్ పేరుతో స్టార్‌చేశామని, పరిశోధనలు చేసుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. గురుజీ బ్రాజ్ బందుదాస మాట్లాడుతూ విద్యను ఎలా నేర్చుకోవాలి, మెడిటెషన్ మీద దృష్టిసారించాలని తెలిపారు. భగవద్గీత, బైబుల్, ఖురాన్ ఇష్టమైనది చదివితే విజ్ఞానం పెరుగుతుందని సూచించారు. ఇష్టపడి చదవితే కష్టం కాకుండా విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగొచ్చన్నారు. నాలుగు సంవత్సరాలు కష్టపడితే జీవితం మీ చేతుల్లో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జేబీ గ్రూప్ ఎడ్యూకేషనల్ ఇనిస్టిట్యూషన్ సీఈవో డాక్టర్ ఎస్ఎస్ దనక, జేబీ గ్రూప్ సీఏవో ఎస్ రాజశేఖర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ పి వెంకటరమణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీవీఎస్ అరుణ్‌మూర్తి, ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ టి శేశగిరి, హెచ్‌వోడీలు డాక్టర్ ప్రభాకరన్, డాక్టర్ అబ్బుల్ రహీం, ప్రొగ్రామ్ ఎంఎల్ఎం ప్రసాద్, శ్రీనివాస్, డాక్టర్ డి గోవర్ధన్, మల్లికార్జునచారి, శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రాజారెడ్డి, మీడియా ఇన్‌చార్చి పివై రమేశ్, యాంటీ ర్యాగింగ్ డాక్టర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి



కొందుర్గులో మహిళా కమిటీ నాయకులతో వజ్రమ్మ

మండల కమిటీ అధ్యక్షురాలు వజ్రమ్మ

కొందుర్గు: కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేయాలని కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షురాలు వజ్రమ్మ అన్నారు. శుక్రవారం కొందుర్గు మండల కేంద్రంలో కాంగ్రెస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో పేదలకు ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల భూములను లాక్కోవడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు.

గ్రామ కమిటీ..

కాంగ్రెస్ కొందుర్గు గ్రామ మహిళా కమిటీ అధ్యక్షురాలుగా కవిత, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా స్వప్న, ఉపాధ్యక్షురాలుగా శ్యామలమ్మ, ప్రధాన కార్యదర్శిగా శిరీష ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నరేందర్, అమృతయ్య, బబ్లూ, విజయ్, శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు



చండీయాగంలో కమిటీ సభ్యులు

మొయినాబాద్: మొయినాబాద్‌లో నిర్వహిస్తున్న బొడ్రాయి పునర్ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం రెండో రోజు చండీయాగం, హోమం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేపట్టారు. శనివారం ఉదయం 10 గంటలకు బొడ్రాయి ప్రతిష్ఠ, అనంతరం బోనాల ఊరేగింపు నిర్వహిస్తారని నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శంకర్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని షాద్‌నగర్-కంది బైపాస్ రోడ్డులో సింగాపురం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సంగారెడ్డి జిల్లా ఎద్దుమైలారం గ్రామానికి చెందిన ఎర్రోళ్ల చంద్రయ్య(48) తన బంధువు అంతప్పగూడ గ్రామానికి చెందిన దోసాడ వెంకటయ్యతో కలిసి బైక్‌పై గంగ్యాడ గ్రామానికి వెళ్తున్నారు. సింగాపురం శివారుల్లోకి చేరుకోగానే ముందు వెళ్తున్న టిప్పర్ అకస్మాత్తుగా ఆపడంతో బైక్‌పై వేగంగా వెళ్తున్న వారు టిప్పర్‌ను ఢీ కొట్టారు. దీంతో చంద్రయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం నగరంలోని కాంటినెంటల్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య పెంటమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. కాగా వెంకటయ్యకు స్వల్ప గాయాలవడంతో శంకర్‌పల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

120 కేసుల పరిష్కారం

చేవెళ్ల: మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌లో శుక్రవారం 120 ట్రాఫిక్ కేసులు పరిష్కారం అయ్యాయని రిటైర్డు జడ్జి సాంబశివరావు తెలిపారు. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో శంకర్‌పల్లి, షాబాద్ మండలాల ట్రాఫిక్ కేసులు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. మూడవ రోజు డ్రంకన్‌డ్రైవ్ కేసుల్లో రూ.3,18,000 జరిమానాలు విధించామన్నారు. ఈనెల 9వ తేదీ వరకు కొనసాగే ఈ లోక్‌అదాలత్‌లో మూడు మండలాల పరిధిలోని ట్రాఫిక్ కేసులను పరిష్కరిస్తామన్నారు. ట్రాఫిక్ సీఐ సైదులు, ఎస్ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్ఐ చందర్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్ స్కీమ్‌కు వ్యతిరేకంగా నిరసన

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌కు వ్యతిరేకంగా నిరసన చేస్తున్నామని పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్షుడు బక్కని బందయ్య అన్నారు. శుక్రవారం అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, బాకారం, అమ్డాపూర్, తోల్‌కట్ట, కనకమామిడి ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి కంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీమ్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పీఆర్‌టీయూటీఎస్ శాఖ పిలుపు మేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపామన్నారు. సీపీఎస్ అమలు చేసిన సెప్టెంబర్ 1ని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు ఉన్నారని ప్రభుత్వం మళ్లీ గెలవాలంటే ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కృష్ణ, మండల గౌరవ అధ్యక్షుడు రాములు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, సంజీవకుమార్, నరేందర్‌రెడ్డి, లక్ష్మణ్, బీమ్లా, కవిత, రాణి, జ్యోతి, అపరష్ణ, అన్వరుద్దీన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

డీడీలు కట్టిన ప్రతీ ఒక్కరికి గొర్రెల పంపిణీ

జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ అంజిలప్ప

కేశంపేట: డీడీలు కట్టిన ప్రతీ ఒక్కరికి గొర్రెల యూనిట్లను అందజేస్తామని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ అంజిలప్ప అన్నారు. మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో గతంలో డీడీలు తీసిన 24 మంది లబ్ధిదారులకు శుక్రవారం గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంజిలప్ప మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా నుంచి జీవాలను తీసుకువచ్చినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 3వేల మంది ఉన్నారని వారందరికీ గొర్రెల యూనిట్లను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి నివేదిత తదితరులున్నారు.

సామాజిక ఆరోగ్యానికి ప్రాధాన్యం

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

శంషాబాద్ రూరల్ : సామాజిక ఆరోగ్యానికి ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోజురోజుకూ పెరుగుతున్న కేన్సర్, ఇతర వ్యాధులను అరికట్టడానికి మంచి ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవనశైలిని పునరుద్ధరించుకోవడం అత్యవసరమని చెప్పారు. ఈ దిశగా వైద్య నిపుణులు ప్రజల్లో అవగాహన, చైతన్యం తీసుకురావాలన్నారు. కేన్సర్ వ్యాధిగ్రస్తులు తీవ్ర బాధను అనుభవించడంతో పాటు వారి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈశాన్య రాష్ట్రాల్లో పొగాకు వాడకంతో ఊపిరితిత్తుల కేన్సర్ పెరుగుతున్నట్లు వైద్య అధ్యయనాలు చెబుతున్నాయని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో పొగాకు వాడకం ఎక్కువగా ఉందని, వీటి ఉత్పత్తుల సేవనంతో వచ్చే నష్టాలను వైద్యులు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. చిరుధాన్యాలతో తయారు చేసే పోషకాహార ఉత్పత్తులను పెంచడానికి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు. వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు హైదరాబాద్ చాప్టర్ కార్యదర్శి బి.సుబ్బారెడ్డి, వైద్య నిపుణులు డాక్టర్ విష్ణుస్వరూప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత



ఇంటి నిర్మాణానికి మెటీరియల్ అందిస్తున్న నాయకులు

ఆమనగల్లు: మాడ్గుల మండలం ఆర్కపల్లి గ్రామంలో రెండు ఇళ్ల నిర్మాణం కోసం ఉప్పల చారిటబుల్ ట్రస్టు చేయూతనందించింది. గ్రామానికి చెందిన వెంకటయ్య, అంజయ్య ఇంటి నిర్మాణం కోసం అవసరమైన మెటీరియల్‌ను ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ సమకూర్చగా శుక్రవారం ఉపసర్పంచ్ బిక్కుగౌడ్ అందించారు.

ఆర్థిక సహాయం

తలకొండపల్లి: మండలంలోని వెల్జాల్‌కు చెందిన జంగయ్య మృతి చెందాడు. శుక్రవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ వెంకటేశ్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. రూ. 3,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాజు, రాఘవేందర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల ఆస్తులు పెంచుతున్న కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న జంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి, జిల్లా కార్యదర్శులు మధుసూధన్‌రెడ్డి, ప్రభులింగం డిమాండ్ చేశారు. శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు చట్టాలను వెనక్కు తీసుకుంటామని కేంద్రం లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చినా నేటి వరకు ఉపసంహరించుకోలేదని మండిపడ్డారు. పలు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ పెట్టుబడిదారుల ఆస్తులను మోదీ ప్రభుత్వం పెంచుతోందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ సంస్థగా మారిందని ఆరోపించారు. ధరణి పేరుతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొమ్ము కాస్తూ రైతుల హక్కులను కాలరాస్తున్నాయని వారు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాంరెడ్డి, అంజయ్య, జగన్, జంగయ్య, వెంకటేశ్, భాషయ్య, తావునాయక్, ఐలయ్య, బిక్షపతి పాల్గొన్నారు.